ఘనంగా ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆదివారం ఉదయం క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే పార్టీ నాయకులు రాపోలు సత్తయ్య, సత్యనారాయణ గౌడ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరుసగా రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ప్రకాశ్ గౌడ్ గెలిచి ప్రజల మనిషిగా గుర్తింపు పొందారన్నారు. ప్రజల్లో ఉన్న నాయకున్ని ప్రజలు ఎన్నడూ విస్మరించరని.. రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలు నిరూపించారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ విగ్రహానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న కస్తూరి నరేందర్ ముదిరాజ్

రాజేంద్రనగర్: రాష్ట్రంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కోరుకున్న ప్రజాపాలన ప్రారంభమైందని నియోజకవర్గం కంటెస్టెడ్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కస్తూరి నరేందర్ ముదిరాజ్ వెల్లడించారు. ఆదివారం రాజేంద్రనగర్ బుద్వేల్ చౌరస్తాలోని ఇందిరాగాంధీ విగ్రహానికి పార్టీ నాయకుడు కోరని శ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాలాభిషేకం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇందిరాగాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ప్రజా పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఆరు హామీలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దశల వారిగా ప్రారంభిస్తారని తెలిపారు. ఆరోగ్యశ్రీ, ఉచిత బస్సు ప్రయాణం పథకాలు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.ధనుంజయ్, నరేందర్, బాల్‌రాజ్, మహ్మద్ ఖలీద్, ప్రభాకర్ రెడ్డి, ఇస్మాయిల్, తాజుద్దీన్, ప్రవీణ్ రెడ్డి, భాస్కర్ గౌడ్, సంజయ్ యాదవ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో మరమ్మతులు



పనులు చేయిస్తున్న మాజీ వార్డు సభ్యులు నవీన్

బండ్లగూడ: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని తమ వంతు బాధ్యతగా సొంత నిధులతో పరిష్కరిస్తున్నామని కిస్మత్‌పూర్ మాజీ వార్డు సభ్యులు నవీన్ వెల్లడించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్ దాత్రి కాలనీలో గత కొన్ని రోజులుగా పని చేయని హైమాస్ట్ లైట్లను మాజీ వార్డు సభ్యులు నవీన్ సొంత డబ్బుతో మరమ్మత్తులు చేయించారు. రాత్రి సమయంలో లైట్లు వెలగకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారని తన దృష్టికి రావడంతో సొంత ఖర్చుతో హైమాస్ట్ లైట్లకు మరమ్మత్తులు చేయించామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన సగర సంఘం నాయకులు

గచ్చిబౌలి: కొత్తగా కొలువుదీరిన మంత్రులను రాష్ట్ర సగర సంఘం నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మంత్రులను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ,పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులను సంఘం నాయకులు కలిశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు సత్యం, కుమార స్వామి, కేపీరామ్, ప్రవంతి, రవి,వెంకటస్వామి, రాము, సాయిగణేష్, సీతారామ్, రమేష్, రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాజీవ్ ఆరోగ్య శ్రీ, ఆర్టీసీ ఉచిత ప్రయాణ పథకాలను ఆదివారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌లు ప్రారంభించారు. కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, హమీద్‌పటేల్, వి.జగదీశ్వర్‌గౌడ్, గంగాధర్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, వెంకటేష్ గౌడ్, శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబ, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్, జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ సృజన, మెడికల్ ఆఫీసర్ చందర్, హెసీయూ డిపో మేనేజర్ మురళీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని పేద, మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ ఈ పథకంపై అవగాహన కల్పించేందుకు ఆరోగ్య కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

పెరుగుతున్న కాలుష్యంతో జీవరాశులకు ప్రమాదం



గోల్కొండ: వాతావరణ కాలుష్యం రోజు రోజుకు పెరుగుతున్నందున మానవాళితో పాటు ఇతర జీవరాశుల జీవితాలపై ప్రభావం పడుతుందని తెలంగాణ స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు అన్నారు. షేక్‌పేట్‌లోని జి. నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా 'కాలుష్యం వాటి నివారణలు' అనే అంశంపై సెమినార్ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. మనం మనకు తెలియకుండానే ఎన్నోసార్లు వాతావరణాన్ని కలుషితం చేస్తున్నామన్నారు. హానికరమైన వ్యర్థాలను తగలబెట్టడం వల్ల వచ్చే పొగ జీవరాశికి రోగాలు అంటబెడుతుందన్నారు. మరోవైపు ఇళ్ల నిర్మాణం, రోడ్ల విస్తరణ తదితర కారణాల వల్ల పచ్చని చెట్లను నరికి వేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక చెట్టును నరికితే దానికి బదులుగా ఆ ప్రాంతం సమీపంలోనే మొక్కలు నాటాలన్న నిబంధనను అమలులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అడవులు, సాగు భూములలో కూడా చెట్లు నరికివేతకు గురవుతుందన్నారు. దీనిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునేలా చట్టంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. బాబుల్ ఎన్జీఓ డైరెక్టర్ గంగాధర్‌పాండే, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, కన్వీనర్ డాక్టర్ కె.శ్యామలదేవి, బేసిక్ సైన్స్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ డాక్టర్ చరణ్‌సింగ్‌తో పాటు అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే వ్యర్థాల పారబోత

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా తడి, పొడి చెత్తను వేరు చేసి డంపింగ్‌యార్డుకు తరలించాలి. దీనికోసం పంచాయతీల పరిధిలో ప్రత్యేకంగా డంపింగ్ యార్డులను నిర్మించారు. అధికారులు, పాలకుల అనాలోచిత నిర్ణయాలతో ఈ యార్డులు నిరుపయోగంగా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్ల పక్కన, వరద కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను పారబోసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలున్నాయి.



నర్కూడలో నిరుపయోగంగా ఉన్న డంపింగ్‌యార్డు

- తయారీకి నోచుకోని వర్మీకంపోస్టు షెడ్డు
- చెత్త సేకరణలో పంచాయతీల నిర్లక్ష్యం

శంషాబాద్ రూరల్: మండలంలో మేజర్ పంచాయతీల్లో ఒకటైన నర్కూడలో నాలుగేళ్ల క్రితం అమ్మపల్లి దేవాలయం సమీపంలో డంపింగ్ యార్డును నిర్మించారు. ఈ స్థలం కోర్టు వివాదంలో ఉండటంతో అక్కడ చెత్త వేయడం మానేశారు. దీంతో చెత్త డంపింగ్ యార్డు కోసం అధికారులు, పంచాయతీ పాలకవర్గం ప్రత్యామ్నాయంగా మల్లెమోని చెరువు శిఖంలో రెండేళ్ల క్రితం నిర్మించినా నేటికి నిరుపయోగంగానే ఉంది. భారీ వర్షాలతో చెరువులో వరదనీరు చేరి డంపింగ్ యార్డుకు వెళ్లే దారి లేకుండా ఉండటం ప్రధాన కారణం.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం..

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం లేదని స్థానికులు చెబుతున్నారు. తడి, పొడి చెత్తను సేకరించి తడి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి వర్మీకంపోస్టు తయారు చేయొచ్చు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఇష్టానుసారంగా చెత్తను తరలిస్తున్నారనే ప్రజలు వాపోతున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో దర్శనమిస్తున్న వ్యర్థాలు..

నర్కూడ పంచాయతీ పరిధిలో సేకరించిన చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారబోసి చేతులు దులుపుకుంటున్నారు. శంషాబాద్–షాబాద్ రహదారిలో నర్కూడ నుంచి శంషాబాద్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన ఎటు చూసినా చెత్త దర్శనమిస్తోంది. వరదకాలువలో చెత్త వ్యర్థాలు పారబోస్తున్నా.. పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనువైన స్థలాలు ఉన్నా..

చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటుకు అనువైన స్థలాలు ఉన్నా.. అధికారులు, తగిన చర్యలు తీసుకోకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. రియల్టర్ల మెప్పుకోసం అనువైన స్థలాలను వదిలేసి, చెరువు శిఖం భూముల్లో, వివాదాస్పద స్థలాల్లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వర్షాకాలంలో ఇబ్బందులు ఎదురౌతున్నాయి..

వర్షాలు కురిసినప్పుడు చెత్త డంపింగ్ యార్డుకు వెళ్లడానికి ఇబ్బందులు ఎదురౌతున్నాయి. దీని కారణంగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం లేదు. ఇకపై వేర్వేరుగా సేకరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మీనర్సింహ, పంచాయతీ కార్యదర్శి, నర్కూడ



రహదారి పక్కన వరదకాలువలో పారబోసిన వ్యర్థాలు



శంషాబాద్ రోడ్డు పక్కన చెత్త కుప్పలు ఇలా..

ఆరోగ్యశ్రీ ఎంతగానో ఉపయోగం



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

రాజేంద్రనగర్: నిరుపేదలకు ఆరోగ్యశ్రీ ఎంతగానో ఉపయోగపడుతుందని రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పథకాన్ని పెంచడం అభినందనీయమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ. ప్రకాశ్ గౌడ్ అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న రెండు నిర్ణయాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఆరోగ్యశ్రీ రూ.10 లక్షల వరకు పెంచడం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్ రావు, కార్పొరేటర్లు అర్చనా జయప్రకాశ్, సంగీత గౌరీ శంకర్, మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ నరేందర్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశోధనలో ప్రతిపాదనలు శాస్త్రీయంగా ఉండాలి

రాయదుర్గం: పరిశోధనలో ఊహా ప్రతిపాదన శాస్త్రీయంగా ఉండాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు విభాగం అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. హెచ్‌సీయూలోని తెలుగు విభాగం కార్యాలయం నుంచి ఆన్‌లైన్ ద్వారా పీఆర్‌ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ కళాశాల తెలుగు పరిశోధన కేంద్రం, డికె ప్రభుత్వ మహిళా కళాశాల నెల్లూరు ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన పరిశోధనా విధానం రెండు రోజుల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిశోధన ప్రణాళికలో ఊహ ప్రతిపాదన సూటిగా, స్పష్టంగా వివరణాత్మకంగా ఉండాలని చెప్పారు. సిద్ధాంత వ్యాస రూపకల్పన ఆకారాలు అనే అంశంపై వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య మేడిపల్లి రవికుమార్ ప్రసంగించారు. అనంతరం పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు వివరణతో తెలుగు పరిశోధన పద్ధతులపై లోతైన చర్చ సాగింది. కార్యక్రమంలో డాక్టర్ కరుణశ్రీ,, డా.పద్మప్రియ పాల్గొన్నారు.

రెడ్డి కులస్తుల సమాజ సేవ గొప్పది



ముఖ్య అతిథులతో రెడ్డి సంఘం కార్యవర్గ సభ్యులు

మణికొండ: మన దేశంలో రెడ్డి కులస్తులకు ఘనమైన చరిత్ర ఉందని ప్రపంచ రెడ్డి సంఘం నాయకుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మణికొండ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు నార్సింగిలోని కేవీఎంఆర్ గార్డన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యావేత్త రాఘవరెడ్డి మాట్లాడుతూ సమాజానికి సేవ చేయటంతో పాటు పాలించటం తెలిసిన వారు రెడ్డి కులస్తులని అన్నారు. పది మందికి మేలు చేసేది వారే అన్నారు. రెడ్డి కులస్తుల్లో ఉన్న పేదలను ముందుగా ఆదుకుని..వారికి విద్య, వైద్యం, ఉపాధి, వివాహాలకు సాయం చేయాలన్నారు. రెడ్డి సంఘం జాతీయ మహిళా నాయకురాలు సుమతీ రెడ్డి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో ముఖ్యమంత్రులుగా, అనేక రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులుగా రెడ్డి కులానికి చెందిన వారు రాణిస్తున్నారన్నారు. గ్రీన్‌స్పేస్ బిల్డర్ గోవిందరెడ్డి మాట్లాడుతూ తాను ప్రతి సంవత్సరం రూ.5 లక్షలు రెడ్డి కులస్తుల సంక్షేమానికి విరాళంగా ఇస్తానన్నారు. ఈ సందర్భంగా సినీనటుడు, మిమిక్రీ ఆర్టిస్టు శివారెడ్డి తన మిమిక్రీతో అందరినీ నవ్వించారు. ప్రముఖ మెజీషియన్ రమాకాంత్ రెడ్డి తన కార్యక్రమం ద్వార అందరినీ అబ్బురపరిచారు. మాస్టర్ ఎస్.మోహిత్ నందన్‌రెడ్డి గుక్క తిప్పుకోకుండా రెడ్ల చరిత్రను చెప్పటంతో ప్రతి ఒక్కరు చప్పట్లతో అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్తీక వనభోజనాలు ఆరగించారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, మణికొండ రెడ్డి సంఘం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.శ్రీకాంత్‌రెడ్డి, శరత్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, రమణారెడ్డి, బాల్‌రెడ్డి, శరత్‌రెడ్డి, భీంరెడ్డి, శ్రీపతిరెడ్డి, బాలవెంకట్‌రెడ్డిలతో పాటు వేలాదిగా రెడ్డి కుటుంబాలు పాల్గొన్నాయి.



మిమిక్రీతో అలరించిన నటుడు శివారెడ్డి



దాండియా ఆడుతున్న మహిళలు

క్రీడల్లో పిల్లలను ప్రోత్సహించాలి



స్కేటింగ్ మైదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కౌన్సిలర్ మేకల వెంకటేష్

శంషాబాద్: తల్లిదండ్రులు పిల్లలను క్రీడలవైపు ప్రోత్సహించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సూచించారు. పట్టణంలోని పదిహేడో వార్డులో నిర్మాణం చేసిన స్కేటింగ్ మైదానాన్ని ఆదివారం స్థానిక కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. క్రీడలు మంచి భవిష్యత్తుకు పునాది వేస్తాయన్నారు. స్కేటింగ్ వంటి క్రీడలు నగరాల నుంచి పట్టణాలకు కూడా అందుబాటులోకి రావడం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ గోపాల్, నార్సింగి ఏఎంసీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, గణేష్‌గుప్తా, కుమార్, జహంగీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోశాల 23వ వార్షికోత్సవం



వేల సంఖ్యలో ఉన్న గోవులు



గోవుల సంరక్షకుడు ధరంరాజ్ రాంఖా



గోవులకు అరటి పండ్లు తినిపిస్తున్న భక్తులు

మైలార్‌దేవ్‌పల్లి: కసాయిల నుంచి రక్షణ కల్పించిన ఆవులకు ఆశ్రయం కల్పించేదే గోశాల అని గోవుల రక్షకుడు ధరంరాజ్ రాంఖా అన్నారు. ఆదివారం గగన్ పహాడ్‌లోని సత్యం శివంసుందరం గోశాల 23వ వార్షికోత్సవంలో అన్నాకూట్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అన్నాకూట్ అనగా ఆహారపర్వతం అని ఈ వేడుకలలో వివిధ ప్రదేశాల నుంచి వచ్చే భక్తులు అనేక రకాల ఆహార పదార్థాలను తయారు చేసి ఆ భగవంతుడికి సమర్పిస్తారు. ఈ సందర్భంగా ధరంరాజ్ రాంఖా మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా 8ఎకరాల స్థలంలో 6000 పైగ ఆవులను 150 మంది సిబ్బందితో రక్షిస్తున్నానని అన్నారు. ప్రతి నూతన సంవత్సరంకు ముందు అన్నాకూట్ కార్యక్రమం చేయడం ఆనవాయితీగా వస్తున్నదని అన్నారు. గోశాలలో ఇన్‌పుట్‌తో సహజ వ్యవసాయంకు ఉపయోగపడుతున్నదని తెలిపారు. ఉదయం నుంచి ఆధ్యాత్మిక, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిచారు. వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రదేశాల నుండి వేల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



వైద్య శిబిరంలో సేవలు అందిస్తున్న డాక్టర్ రోహిత్ రెడ్డి పథూరి



వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులు

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ జనప్రియ ప్రాంతంలో ఆదివారం ప్యూర్ కేర్ పాలీ క్లీనిక్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో స్థానిక ప్రాంతాలకు చెందిన రోగులు దాదాపు 180 మంది వైద్య శిబిరంలో పాల్గొన్నారు. ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చిందని ఈ శిబిరంలో పాల్గొన్న రోగులకు వైద్యులు డాక్టర్ రోహిత్ రెడ్డి పథూరి, డాక్టర్ శ్రద్ధా సంఘానీ ఆధ్వర్యంలో పల్మనరీ ఫంక్షన్ టెస్ట్, అడల్ట్ వ్యాక్సినేషన్ ఎడ్యూకేషన్ డెన్సిటీ, విటల్ మానిటరింగ్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పేదలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు రోహిత్ రెడ్డి తెలిపారు.